క్లుప్తంగా

ఘనంగా చండీయాగం


శ్రీకామాక్షి అమ్మవారి చండీయాగం చేపడుతున్న అర్చక పండితులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో (శ్రీకామాక్షి అమ్మవారి హోమం) చండీయాగం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజ, హోమ మహోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరగనున్నాయి. ఇందులో భాగంగా తొలి రోజు యాగశాలలో ఉదయం పూజ, నిత్యహోమం, చండీహోమం, లఘుపూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. భక్తులు రూ.500 టికెట్‌తో ఒకరోజు హోమంలో పాల్గొన్నారు. ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫ్రెషర్స్ డే


వేడుకలను ప్రారంభిస్తున్న అధ్యాపక బృందం

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు కోలాహలంగా జరిగాయి. కళాశాల కార్యదర్శి వై.ఆనందరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, ఈసీఈ విభాగాధిపతి సాయిప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాలలో ఉన్న అధునాతన లేబరేటరీ, లైబ్రరీలు, క్రీడామైదానాలను సక్రమంగా వినియోగించుకుని క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, కార్యదర్శి వై.ఆనందరెడ్డి పిలుపునిచ్చారు. తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

విశ్వనాథం సేవలు ఆదర్శనీయం


ఎల్‌ఎఫ్‌ను సత్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాకాల: ఉత్తమ సేవాపథకం అందుకున్న అగ్నిమాపక శాఖ ఎల్‌ఎఫ్ విశ్వనాథంను సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఓ గుణశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఓ మాట్లాడుతూ విశ్వనాథం విధుల్లో అంకిత భావంతో పని చేస్తారన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు.

శరవేగంగా 'తిరుపతి రూరల్' అభివృద్ధి


మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: శరవేగంగా తిరుపతి రూరల్ మండలంలోని ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందుతోందని తుడా చైర్మన్, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారుల అభివృద్ధికి టీటీడీ రూ.60 కోట్లు కేటాయించడంపై టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు చెబుతూ తీర్మానం చేశారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్, ఫాగింగ్ చేయించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదాలకు అరికట్టే దిశగా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. విద్యుత్ కోతల విషయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలవాసులకు జగనన్న హౌసింగ్ పథకం కింద ఏర్పేడు సమీపంలోని చిందేపల్లె వద్ద కేటాయించిన స్థలాల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నామని తెలిపారు. అక్కడ స్థల అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. తొండవాడ, దుర్గ సముద్రం లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా సర్పంచ్ చర్యలు చేపట్టాలని సూచించారు. వేదాంతపురం సర్పంచ్ జనార్ధన్‌యాదవ్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు రత్నమ్మ, వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవరెడ్డి, ఎంపీడీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలపై ప్రత్యేక దృష్టి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు


వృద్ధుడి చెంతకే వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు

చంద్రగిరి: 'జగనన్నకు చెబుదాం' స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చూపాలని ప్రోటోకాల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు వివిధ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం చంద్రగిరిలోని మురళీకృష్ణ కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో వచ్చిన జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలను గ్రామ, మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా అధికారులు అందుబాటులో ఉండి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 17, హౌసింగ్-06, అటవీశాఖ-36, రెవెన్యూ-33, రోడ్లు,భవనాలు-1, రిజిస్ట్రేషన్-1, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్-1, విపత్తుల నిర్వహణ-1తో కలసి మొత్తం-96 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అందిన ప్రతి అర్జీను ఆయా శాఖలకు అందించడం జరిగిందని, నిర్దేశించిన గడువులోపు వాటిని పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇప్పటికే పలు మండలాల్లో మండల స్థాయిలో జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, డీఓఈ శేఖర్, డీఎల్‌డీఓ సుశీలదేవి, ఎంపీడీఓ బాలాజీ నాయక్, తహసీల్దార్ శిరీష, పాకాల సీఐ ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, సంబంధింత జిల్లా అధికారులు పాల్గొన్నారు.
బుధవారం నిర్వహించిన

నూతన వధూవరులకు శుభాకాంక్షలు


నూతన దంపతులను శుభాకాంక్షలు తెలియజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): నూతన వధూవరులను తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుచానూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, శ్రీపరాశరేశ్వర ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి అక్క కుమారుడు దొడ్డారెడ్డి దిలీప్ రెడ్డి, హరిప్రియ రెడ్డి వివాహం తిరుపతిలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. రిసెప్షన్ కార్యక్రమానికి హాజరైన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నూతన దంపతులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట శ్రీధర్ రెడ్డితో పాటు దొడ్డారెడ్డి మనోహర్ రెడ్డి, ఊర్మిళ ఇతర నాయకులు ఉన్నారు.

మెరుగైన సేవలు అందించండి

తిరుపతి తుడా: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బంది నిరంతరం కృషి చేయాలని నగర డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ సూచించారు. 14వ డివిజన్ సచివాలయ కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సిబ్బంది అటెండెన్స్, నోటీస్ బోర్డులను పరిశీలించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సచివాలయ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆయా విభాగాల కార్యదర్శులు సంబంధిత విధుల పట్ల పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీఎస్, సచివాలయ కార్యదర్శులు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జేసీఎస్ కన్వీనర్లు కుమార్, ఉదయగిరి రమేష్, ఎంఎల్‌ఓ వెంకటరమణారెడ్డి, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జవాను భార్య మృతి

- జవాన్ బిడ్డలను చూసి చలించిపోయిన తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి


సుధారాణి పార్థీవదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యం పంచాయతీ మర్రిపాటివారిపల్లెకు చెందిన నవీన్ మిలిటరీలో జవాన్‌గా పని చేస్తున్నాడు. ఆయన సతీమణి సుధారాణి బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని జవాన్ భార్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. దేశ రక్షణ కోసం భర్తను పంపించి ఇద్దరు చిన్న బిడ్డలను చూసుకుంటూ సంతోషంగా జీవిస్తున్న సుధారాణి చనిపోయిందని స్థానికులు మోహిత్‌రెడ్డికి చెప్పడంతో ఆయన భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. అభం శుభం తెలియక అమాయకంగా చూస్తున్న జవాన్ బిడ్డలను ఎత్తుకుని ఆయన ఓదార్చారు. గ్రామంలో సుధారాణి మృతితో విషాద చాయలు అలుముకున్నాయి. కార్యక్రమంలో చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, నాయకుడు సూర్యప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న కార్తీక కోటి దీపోత్సవం


మాట్లాడుతున్న తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్

తిరుపతి కల్చరల్: టీటీడీ ధర్మప్రచార పరిషత్ సహకారంతో తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద కార్తీక కోటి దీప మహోత్సవం చేపడుతున్నట్లు ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా కార్తీక మాసంలో సంప్రదాయబద్ధంగా అత్యంత వైభవంగా కార్తీక కోటి దీప మహోత్సవం చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 27న చేపడుతున్న కార్తీక కోటి దీప మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీప ప్రజ్వలనతో పరమేశ్వరుని కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్తీక కోటి దీప మహోత్సవంలో భాగంగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పుష్పాలంకరణ సేవ, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు కార్తీక దీప సేవ కార్యక్రమం, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు లలిత సహస్రనామం, స్వామివారి రుద్రాభిషేకం ఉంటుందన్నారు. అనంతరం 6 నుంచి 9 గంటల వరకు భక్తులతో కార్తీక దీప మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. కార్తీక దీప మహోత్సవంలో ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులతో హాజరు కావాలని కోరారు. ఇందుకు సంబంధించిన పాస్‌లు ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9848837331,9440078978, 9440271154లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో తిరుపతి ఫిలిం సొసైటీ నేతలు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భాకరాపేట: కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా చీఫ్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డీవైఎస్‌ఓ కృష్ణమూర్తినాయుడు అన్నారు. బుధవారం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో కులగణనపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కులగణనను చేపట్టేందుకు ప్రభుత్వం సచివాలయాలను ఎంపిక చేసిందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కుల గణన సర్వే చేపడతారని, ప్రజల కులం, ఉపకులంతో పాటు పలు వివరాలను ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడంతో పాటు ప్రతి ఇంటి సర్వే ముగింపులో వలంటీర్, సెక్రటేరియట్ ఉద్యోగి ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. ఈ నెల 27 నుంచి కులగణన సర్వే ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు దేవేంద్రబాబు, అమర్‌నాథ్, తహసీల్దార్లు లోకేశ్వరి, దస్తగిరియ్య, ఈఓపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కుల గణన సర్వేపై మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమానికి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణన సర్వే చేసే విధానం, అందుకు సంబంధించిన యాప్‌ని వినియోగించే అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ మాలతి, ఎంఈఓ బాబ్జీ, ఎంఈఓ-2 లింగయ్య, ఏఎస్‌ఓ కన్నయ్య, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ


సీగొల్లపల్లిలో పెళ్లికానుకను అందిస్తున్న నేతలు


మహంతువారిపల్లిలో పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు


శ్రీనివాసమంగాపురంలో..

చంద్రగిరి: నియోజకవర్గంలో త్వరలో పెళ్లి చేసుకోనున్న నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వివాహ కానుకను పార్టీ నాయకులు అందజేశారు. బుధవారం మండల పరిధిలోని గంగుడుపల్లి పంచాయతీ చెందిన మమత రెడ్డి, తరుణ్ కుమార్ రెడ్డి, మిట్టపాళెం పంచాయతీ శ్రీనివాసమంగాపురానికి చెందిన శివకేశవులు, భార్గవికి వివాహం నిశ్చమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, చంద్రగిరి డివిజన్ పనల నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు నూతన వధూవరులకు ఎమ్మెల్యే వివాహ కానుక (బంగారు తాళిబొట్టు, పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డూ-వడ, అమ్మవారి పసుపు-కుంకుమ, వెండి మెట్టెలు)ను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, గంగుడుపల్లి పార్టీ అధ్యక్షురాలు అచర్యత రెడ్డి, రూపసుందర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లి పంచాయతి మహంతువారిపల్లి గ్రామంలో త్వరలో వివాహం చేసుకోనున్న వధువు దివ్య తల్లిదండ్రులకు నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పీహెచ్‌సీ చైర్మన్ మహేంద్రరెడ్డి, ఎంపీటీసీ రాజేష్, చిట్టబాబు, కోటి బుధవారం పెళ్లికానుక అందించారు.

తిరుపతి రూరల్‌లో..

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందించిన చెవిరెడ్డి పెళ్లికానుకను వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి అందజేశారు. సీగొల్లపల్లికి చెందిన పూడి బాలసుబ్రమణ్యం, శ్రీలక్ష్మి కుమార్తె రచనారెడ్డికి సాయికిరణ్‌తో ఈనెల 24న వివాహం జరగనుంది. ఈనేపథ్యంలో బుధవారం సీగొల్లపల్లిలో పెళ్లికుమార్తె రచనారెడ్డికి చెవిరెడ్డి పెళ్లికానుకను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ విడుదల రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం


ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ సంఘం (అప్సా) రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన వి.సుబ్రమణ్యంరాజును బుధవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అప్సా జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు ఘనంగా సత్కరించి అభినందించారు.
–తిరుపతి ఎడ్యుకేషన్

నిధులు మంజూరు చేయండి


మంత్రి ముత్యాల నాయుడిని సత్కరిస్తున్న డాక్టర్ పీసీ.రాయులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ పీసీ.రాయులు కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం రాష్ట్రస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సమావేశమై కమిటీ చేపట్టనున్న అన్ని కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమానికి అధికారులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన నామినేటెడ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, అనధికారిక సభ్యులతో కూడిన మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రయోజిత కార్యక్రమాల గురించి సుదీర్ఘ చర్చ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత మొదటి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రిత్వ శాఖ గ్రామీణాభివృద్ధి అండ్ పంచాయితీరాజ్ కార్యకలాపాల అమలును సమీక్షించారు.

జగదానందకారకా..


తెప్పపై విహరిస్తున్న సీత, లక్ష్మణ సమేత శ్రీరాముడు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలోని శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఐదురోజుల కార్తీక తెప్పోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీసీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తి తెప్పపై జలవిహారం చేస్తూ భక్తులను అనుగ్రహించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తిలో డిసెంబర్ 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు జరుగనున్న ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలను కార్మికులంతా కలిసి జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ నగర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-చలానాల రద్దు, రవాణా రంగంలో నూతన చట్టాల రద్దు, ఆటో రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు సాధనకై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల జిల్లా ప్రథమ మహాసభల్లో రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి, ఆటో యూనియన జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, కేవై. రాజా, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న రాస్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్: ప్రస్తుత ఆధునిక సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి మహిళా స్వయం ఉపాధిలో రాణించేందుకు చేతివృత్తులను నేర్చుకుని తద్వారా ఆర్థికంగా ఎదగాలని, తద్వారా తమ కుటుంబాలకు బాసటగా నిలవాలని రాస్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాస్-జనశిక్షణ సంస్థ వారి ఆధ్వర్యంలో కొర్లగుంటలో బుధవారం ఏర్పాటు చేసిన మహిళలకు మూడు నెలల ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాస్ జనశిక్షణ సంస్థ ప్రోగ్రాం అధికారి బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాస్ నిర్వహించే కార్యక్రమాలు, ప్రభుత్వం పథకాల గురించి తెలియజేస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిక్షణ తీసుకునే మహిళలకు ఉచితంగా టైలరింగ్ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, రామానుజులు, సీతారామలక్ష్మి, సుమతి, మహిళలు పాల్గొన్నారు.



ఘాట్ రోడ్లను కమ్మేసిన పొగ మంచు




జీఎంసీ వద్ద మంచులో పని చేస్తున్న కార్మికురాలు

వెండికొండలా..

తిరుమల: కలియుగ వైకుంఠ దైవం వెలిసిన తిరుమలకు వెళ్లే ఘాట్ రోడ్డులో పొగ మంచు భారీగా కురుస్తోంది. కొండలను మంచు కప్పేస్తుండడంతో వెండికొండలా దగదగా మెరుస్తున్నాయి. వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్తున్నారు. మంచి సోయగాలతో చెట్లన్నీ పచ్చదనాన్ని వెదజల్లుతున్నాయి.

నాడు కాసింత సందు..
నేడు 60 అడుగుల రోడ్డు


నాడు నవాబ్ పేటకు వెళ్లే ఇరుకు రహదారి


నేడు విశాలంగా మారిన రహదారి

తిరుపతి నగరంలోని తిలక్‌రోడ్డు నుంచి నవాబ్‌పేటకు వెళ్లే దారి ఇరుకుగా ఉండడంతో గత 40 ఏళ్లుగా నరకయాతన పడ్డారు. అయితే తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి కృషితో నవాబ్‌పేటకు వెళ్లే దారి ఇప్పుడు అరవై అడుగుల రోడ్డుగా మారింది. నూతన సీసీరోడ్డు, కాంతులు వెదజల్లే విద్యుత్ వెలుగులు, తాతయ్యగుంట గంగమ్మ చరిత్ర తెలిపే చిత్రాలను రోడ్డు వెంట చిత్రీకరిస్తున్నారు. ఈ రహదారికి భూపిరాట్టి మార్గం(జగద్గురు శ్రీశ్రీ రామానుజాచారి తల్లి)గా నామకరణం చేశారు.
– ఫొటోలు: మహ్మద్ రఫీ, సాక్షి, తిరుపతి


రోడ్డు వెంబడి ప్రహరీ గోడకు ఆకట్టుకునేలా గంగమ్మ చరిత్ర చిత్రాలు